

రంగోలిలతో ముగ్గులు వేస్తున్న డీఆర్డీవో శాఖ మహిళా సిబ్బంది

## ఓటుహక్కుపై వినూత్న ప్రచారం

వనపర్తి, నవంబర్ 7: వనపర్తి జిల్లా సమీకృత భవనంలో డీఆర్డీవో శాఖ అధ్వర్యంలో రంగులతో ఓటుహక్కుపై ముగ్గుల కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఎస్‌వీఈఈపీపై అవగాహన కార్యక్రమంలో భాగంగా 18ఏండ్లు పైబడిన ప్రతిఒక్కరూ తమ ఓటును వినియోగించుకొని ఓ మంచి నాయకుడిని ఎన్నుకోవాలని రంగోళిలతో విన్నూతంగా అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటుహక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరుపతి రావు, డీఆర్డీవో నర్సింహ, డీఎస్‌డీవో నిషిత, అడిషనల్ డీఆర్డీవో రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటివద్దనే ఓటింగ్

- ఫారం-12డీతో ఎన్నికల సంఘం వెసులుబాటు
- తొలిసారి వయోభారం, దివ్యాంగులకు అవకాశం
- జిల్లాలో 80ఏండ్లు దాటిన 6,365మంది ఓటర్లు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

వనపర్తి టౌన్, నవంబర్ 7: మారుతున్న కాలానికి అనుగుణంగా ఎలక్షన్ కమిషన్ ఉన్న వనరులను ఉపయోగించి ప్రతి ఓటరు ఓటును సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగా అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తొలిసారిగా వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టింది. అర్హులైన ఓటర్లకు ఇంటి వద్ద నుంచే ఓటు వినియోగించుకునేలా పక్కా ప్రణాళిక రూపొందించింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాలనుకునేవారు దరఖాస్తు చేసుకునేలా పోస్టల్ బ్యాలెట్ తయారు చేసింది. ఈ బ్యాలెట్ పేపర్ గులాబీ పింక్ రంగులో ఉంటుంది. రాష్ట్రంలో తొలిసారిగా వికలాంగులు, 80ఏండ్లు దాటినవారు ఇంటినుంచే ఓటు వేసే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఇంటి వద్దనే ఓటు వేయాలనుకునే వారు ఈ నెల 8వతేదీలోగా బూత్ లెవల్ అధికారికి 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అప్పుడు మాత్రమే ఇంటినుంచి ఓటు వేసే చాన్స్ లభిస్తుంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి ఎన్నికల రోజున సిబ్బంది వస్తారు. వారి దగ్గర ఓ బ్యాలెట్ బాక్సు ఉంటుంది. అందులో ఓటు వేయవచ్చు. ఎవరికీ ఓటు వేసినారో వేసేవారికి తప్పా ఎవరికీ తెలియదు. ఎన్నికల పీవో, ఏపీవో, ఓపీవో, పోలీస్‌శాఖ ఇతర సిబ్బందితో కూడిన సభ్యులు పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకునేలా అవకాశం కల్పించింది. వనపర్తి జిల్లాలో మొత్తం 296 పోలింగ్ కేంద్రాలకుగానూ 2,65,622ఓట్లు ఉండగా గతనెల 31 వరకు అవకాశం ఇవ్వడంతో 2,67,114 కొత్త ఓటర్లు నమోదయ్యారు. అందులో పురుషులు లక్షా33వేలకు పైగా, మహిళలు లక్షా34వేలకు పైగా నమోదవ్వగా ఇతరులు ఏడుగురు ఓటర్లు కలరు.



పింక్ కలర్‌లో ఉన్న పోస్టల్ బ్యాలెట్

***జిల్లాలో ఓటర్లు ఇలా..***

వనపర్తి జిల్లావ్యాప్తంగా వృద్ధులు, వికలాంగులు మొత్తం 6,365మంది ఓటర్లు ఉండగా అందులో 3,817 పురుషులు, 2,548 మంది మహిళలు ఉన్నారు. వీరికి ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వోలు తమ ఓటుహక్కును కేంద్రాల వద్దకు వస్తారా లేదా ఇంటి వద్దనే ఓటుహక్కును వినియోగించుకుంటారని పరిశీలించి పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేస్తున్నారు. వయోభారం, మానసిక వైకల్యత, శారీరక వైకల్యత తీవ్రతను బట్టి ఈ ఓటును సద్వినియోగం చేసుకునేలా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

***13 కేటగిరీల వారికి అవకాశం..***

పోస్టల్ బ్యాలెట్ విధానం మొదట్లో మిలిటరీ వారికి ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చేవారు. కానీ ఇటీవల 13విభాగాల అధికారులకు ఎన్నికల కమిషన్ ఈ అవకాశాన్ని కల్పించింది. అందులో భాగంగా తపాల, పోలీస్ శాఖ, వైద్యశాఖ, ఎన్నికల్లో పాల్గొనే విద్యా శాఖ, వైద్యం, పత్రికా విలేకరులకు కూడా ఈ అవకాశం కల్పించారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ


నివాళులర్పిస్తున్న వంగూరు ప్రమోద్‌రెడ్డి

పెద్దమందడి, నవంబర్ 7: మండలంలోని వెల్టూరు గ్రామానికి చెందిన గౌర్రె రాములు, బలిజపల్లి గ్రామానికి చెందిన ఎర్ర జమీన్ లక్ష్మి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వనపర్తి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి మంగళవారం మృతుల ఇండ్లకు వెళ్లి పార్థీవదేహాలకు పూలమాలలు వేసి వేర్వేరుగా నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఉన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ఖిల్లాఘణపురం, నవంబర్ 7: త్వరలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు మద్యం, డబ్బు ఇతరత్రా వాటి సరఫరాను అరికట్టేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసినట్లు ఆయన చెప్పారు. ఎవరైనా మద్యం, డబ్బు తరలిస్తే వాటికి సరైన రసీదులు వెంట పెట్టుకోవాలని, ఒకవేళ రూ.50వేల కంటే ఎక్కువ డబ్బు మీ వెంట ఉంటే వాటికి ఆధారాలు చూపించాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. తనిఖీలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు, కేంద్రసాయుధ బలగాలు

## ఐదోరోజు రెండో నామినేషన్

వనపర్తి, నవంబర్ 7: వనపర్తి నియోజకవర్గంలో ఐదోరోజు ఒక నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి తిరుపతిరావు తెలపారు. మంగళవారం నామినేషన్ దాఖలు చేసిన వారిలో రేవల్లి మండల చెన్నారం గ్రామానికి చెందిన బంకల ఎల్లయ్య ధర్మసమాజ్ పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 5రోజులుకుగానూ రెండు నామినేషన్లు వచ్చాయన్నారు.

## నగదు విత్‌డ్రాపై కేసు నమోదు..

ఖిల్లాఘణపురం, నవంబర్ 7: గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం కార్డుతో రూ.51,500 విత్‌డ్రా చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్సై శ్రీహరి కథనం ప్రకారం.. మండలంలోని మానాజీపేటకు చెందిన ఆంజనేయులు తన అవసరాల నిమిత్తం ఒకే బ్యాంకు అకౌంట్‌కి రెండు ఏటీఎం కార్డులు తీసుకోగా.. ఇటీవల ఒక ఏటీఎం చేజార్చుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు చేజార్చుకున్న ఏటీఎం కార్డుతో రూ.51,500 విత్‌డ్రా చేశారని బాధితుడు ఆంజనేయులు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీహరి హెచ్చరించారు. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని అంతాయపల్లి వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నామని, 10 ట్రాక్టర్లలో ఇసుకను నింపి ఉంచగా పోలీసులను చూసి వాటిని ఖాళీ చేశారన్నారు. ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, ఒక హిటాచీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్లు

## ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో

మహబూబ్‌నగర్‌టౌన్, నవంబర్ 7: లిటిల్ స్కాలర్స్ స్కూల్ ఆధ్వర్యంలో స్థానిక ఎండీఏసీ మైదానంలో జలజం సత్యనారాయణ స్మారక అంతర్ పాఠశాలల క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతున్నది. మంగళవారం రెండోరోజు పోటీలను డీఈవో రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. జలజం సత్యనారాయణ విద్యారంగానికి చేసిన సేవలను గుర్తుచేశారు. ఆయన పేరిట ప్రతి ఏడాది క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడాకారులను పోత్రహించడంపై కుటుంబ సభ్యులను అభినందించారు. మ్యాచ్‌లో లుంబినీ, గీతశ్రీ, అపెక్స్, ఉదయ మెమోరియల్ జట్లు గెలిచాయి. కార్యక్రమంలో లిటిల్ స్కాలర్స్ స్కూల్ డైరెక్టర్ విదుషిరాయ్, ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, ప్రిన్సిపాల్ రవీందర్, పీఈటీలు వినోద్, అరుణ్, నాజర్, వెంకట్ పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు, నవంబర్7: స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో 2023-24కు సంబంధించి కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ ఆదేశాల మేరకు కళాశాలలో తెలుగు, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టుల్లో బోధించుటకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మావతి మంగళవారం ప్రకటనలో తెలిపారు. వాటికి సంబంధిత విభాగాల్లో 55శాతం మార్కులు ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తులు ఈనెల 8వ తేదీ సాయంత్రం 4:30గంటల లోగా సమర్పించాలని, 9వ తేదీన ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

# భావితరాలకు మార్గదర్శకులు శాస్త్రవేత్తలే..

వనపర్తి టౌన్, నవంబర్ 7: భావితరాలకు మార్గదర్శకులు శాస్త్రవేత్తలేనని టీజేఏసీ నాయకులు రాజారాంప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శాస్త్రవేత్తలు మేడం క్యూరీ 156వ జయంతి, సీవీ రామన్ 136వ జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి విద్యార్థులు శాస్త్రవేత్తలను ఆదర్శకంగా తీసుకొని శాస్త్రవిజ్ఞానంపై పట్టు సాధించాలని, భావితరాలకు మార్గదర్శుకులు శాస్త్రవేత్తలేనని, శాస్త్రవేత్తల మార్గంలో విద్యార్థులు నడవాలని సూచించారు. కార్యక్రమంలో కవి పండితులు గిరిరాజాచారి, వ్యాఖ్యత డాక్టర్ నాయకంటి నర్సింహాశర్మ, మండ్ల దేవన్ననాయుడు, బాలస్వామి, గంధం నాగరాజు, తగువుల వెంకటస్వామి, బాలేమియా, భద్రయ్య, అంజి, రాజు తదితరులు పాల్గొన్నారు.


శాస్త్రవేత్తలకు నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు